ప్రజాశక్తి
శనివారం 10 జూన్ 2023
5
శ్రీకాకుళం

వృద్ధాశ్రమాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వృద్ధాశ్రమాలు నిర్వహించే వారు తప్పనిసరిగా వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా కార్యాలయం నుంచి అనుమతులు పొందాలని ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సంబంధిత ధ్రువపత్రాలతో అందే దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. అనుమతి పొందని, గుర్తింపు లేని వృద్ధాశ్రమాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరిన్ని వివరాలకు 08942 240519 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

మాటల్లోనే మత్స్యకార సంక్షేమం

- కదలిక లేని ఫిషింగ్ హార్బర్
- అర్ధాంతరంగా ఆగిన మంచినీళ్లపేట జెట్టీ
- ఇదిగో అదిగో అంటూ ఊరిస్తున్న పాలకులు
- మత్స్యకారుల్లో ఆగని వలసలు

జిల్లాలో 193 కిలోమీటర్ల మేర విశాలమైన సముద్రతీరం ఉంది. లక్షన్నరకు పైగా మత్స్యకార జనాభా ఉంది. సుమారు 50 వేల కుటుంబాలు చేపల వేట పైనే బతుకుతున్నారు. అయినా జిల్లాలో ఒక్క హార్బరూ లేదు. ఒక్క జెట్టీకి దిక్కు లేకుండా పోయింది. టిడిపి అధికారంలో ఉన్నన్నాళ్లు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మిస్తామంటూ మాటలతోనే కాలక్షేపం చేసింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మంచినీళ్లపేటతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూలపేట పోర్టుతో పాటు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కూ శంకుస్థాపన చేశారు. తర్వాత ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఫిషింగ్ హార్బర్, జెట్టీ నిర్మాణాలు ఇదిగో అదిగో అంటూ పాలకుల ఊరింపే తప్ప హామీలు వాస్తవరూపం దాల్చడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 11 తీర ప్రాంత మండలాల పరిధిలో 104 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో 1,46,192 మంది జనాభా, 46,580 కుటుంబాలు ఉన్నాయి. మూడు దశాబ్దాల కిందట వరకు ఇందులో 80 శాతం కుటుంబాలు చేపల వేటపై బతకగా, మిగిలిన 20 శాతం కుటుంబాలు వ్యవసాయం, ఇతర వృత్తులు, కూలి పనులు చేసుకునేవారు. ప్రస్తుతం మత్స్యకారుల జీవన స్థితిగతులన్నీ తారుమారయ్యాయి. ఇందులో చేపల వేటకు వెళ్తున్న వారి సంఖ్య 13 వేల నుంచి 15 వేలు మాత్రమే ఉంది. చేపల వేట సరిగా సాగక వేలాది మంది మత్స్యకారులు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. అక్కడ బోటు యజమానుల వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు. గుజరాత్‌లోని ఒక్క వీరావల్ ప్రాంతంలోనే జిల్లాకు చెందిన మత్స్యకారులు సుమారు మూడు వేల మంది ఉన్నారు. జిల్లాలోని తీర ప్రాంతంలో చేపలు దొరక్కపోవడంతో వేలాది మంది మత్స్యకారులు ఏకంగా చేపల వేట మానుకుని ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. రోడ్డు వెంబడి టోపీలు, ఊయళ్లు అమ్ముకుని బతుకుతున్నారు. మరికొందరు పెయింటింగ్ పనులు చేస్తున్నారు. కొంతమంది గ్రామాల్లోనే ఉంటూ ఆటోలు, ప్రయివేట్ వాహనాలకు డ్రైవర్లుగా వెళ్తున్నారు. ఇలా వేలాది మంది మత్స్యకారులు చేపల వేటకు దూరమవుతున్నారు.

తీర ప్రాంతాల్లో కొరవడిన మౌలిక వసతులు

జిల్లాలో మత్స్య సంపదను నిల్వ చేసేందుకు ఎక్కడా కోల్డ్ స్టోరేజీలు లేవు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, డి.మత్స్యలేశం, రాళ్లపేటలో జెట్టీ, కవిటి మండలం ఇద్దివానిపాలెంలో జెట్టీ, సోంపేట మండలం బారువలో జెట్టీ, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు-మంచినీళ్లపేట జెట్టీ నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. గతంలో బారువ, నువ్వలరేవు తదితర తీరాల్లో ఏర్పాటు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

కదలిక లేని ఫిషింగ్ హార్బర్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగరమాల ప్రాజెక్టుల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 2020లో నిర్ణయించారు. ఇందుకోసం రూ.365.81 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన డబ్బులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. హార్బర్ నిర్మాణానికి 42 ఎకరాలు అవసరమవుతుందని అధికారులు గుర్తించారు. 2020లోనే భూసేకరణ పూర్తి చేశారు. అదే సంవత్సరం గ్రామంలో పర్యావరణ మదింపు కూడా చేశారు. హార్బర్ నిర్మాణ వ్యవహారాలను ఎపి మారిటైం బోర్డు పర్యవేక్షిస్తోంది. గతేడాది మేలో టెండర్లను పిలిచిన ప్రభుత్వం, విజయవాడకు చెందిన విశ్వ సముద్ర ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. మూలపేట పోర్టుతో పాటు ఫిషింగ్ హార్బర్‌కు ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

అర్ధాంతరంగా ఆగిన జెట్టీ

వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మాణ ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. అందులో భాగంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిష్ లాండింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.13.95 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టింది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.2.61 కోట్ల బిల్లులను చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. ఇప్పటివరకు 32 శాతమే పనులు పూర్తయ్యాయి. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మే 31వ తేదీ లోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే, పనులు పూర్తిస్థాయిలో కావడానికి కనీసం ఏడాదికి మించి సమయం పట్టే అవకాశం ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని నిర్ణయించింది. భూసేకరణ పనులు మినహా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రూ.332.09 కోట్లతో ప్రభుత్వం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించింది. ప్రస్తుతం నిర్మాణానికి అవసరమైన 40.88 ఎకరాల భూమిని సేకరించారు. ఫిషింగ్ హార్బర్‌తో పాటు జెట్టీ నిర్మాణం పూర్తయితే మత్స్యకారులు స్థానికంగానే ఉండి చేపల వేటతో సాగించేవారు. మత్స్య సంపద తగ్గడం, సౌకర్యాలు లేకపోవడంతో వారిలో వలసల పరంపర కొనసాగుతోంది.

ఎండ తీవ్రతకు 30 గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి - నందిగాం

నిప్పులు చెరిగిన ఎండ తీవ్రతకు తాళలేక 30 గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన మందస మండలం మకరజోలలో శుక్రవారం చోటుచేసుకుంది. నందిగాం మండలం పోతులూరు, రథజన, బొడ్డపాడు, మదనాపురం గ్రామాలకు చెందిన బుడ్డ రామయ్య వంద గొర్రెలు, ఈది గవరయ్య 60 గొర్రెలు, నమ్మి లచ్చయ్య 53 గొర్రెలతో కూడిన మందను మేత కోసం మందస మండల మకరజోలకు తీసుకెళ్లారు. అక్కడ గూడులో 30 గొర్రె పిల్లలను ఉంచి గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. ఎండ తీవ్రతకు గూడులో ఉన్న గొర్రె పిల్లలన్నీ మృతి చెందాయి. సాయంత్రం మేత నుంచి తిరిగొచ్చి గూడు తీసి చూసేసరికి గవరయ్యకు చెందిన 9, లచ్చయ్యకు చెందిన 6, రామయ్యకు చెందిన 15 గొర్రె పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నాయి. సుమారు రూ.రెండు లక్షల విలువ చేసే గొర్రె పిల్లలు మృత్యువాత పడడంతో పెంపకందారులు లబోదిబోమంటున్నారు. నష్టపోయిన పెంపకందారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి కోరారు.

మృతి చెందిన గొర్రెపిల్లలు

నౌపడలో గాలివాన బీభత్సం

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో శుక్రవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా వీచిన గాలులకు పలుచోట్ల చెట్లు నేలకూలాయి. పావుగంట పాటు వడగళ్ల వాన కురిసింది. గాలులకు నౌపడ గ్రామానికి చెందిన వృద్ధురాలు గుజ్జు బూల్లమ్మ రేకుల షెడ్డు కూలిపోయింది. పలికిల రాజేశ్వరికి చెందిన వంటగదిపై తాటిచెట్టు పడిపోవడంతో వంటగది నేలమట్టమైంది. ఎల్తూరు సురేష్‌కు చెందిన రేకుల షెడ్డు గాలికి ఎగిరిపోయింది. గాలుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సాయంత్రం సరఫరాను పునరుద్ధరించారు.

గాలివానకు కూలిన రేకుల షెడ్ వద్ద బూలమ్మ

నౌపడలో కురుస్తున్న వర్షం

వంటగదిపై కూలిన చెట్లు చూపిస్తున్న రాజేశ్వరి

బలవంతపు రిటైర్మెంట్ ఆపాలి

కార్మిక, పరిశ్రమలశాఖ కార్యదర్శికి సిఐటియు వినతి

ప్రజాశక్తి - రణస్థలం

శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమలో యాజమాన్యం చేస్తున్న బలవంతపు రిటైర్మెంట్‌ను ఆపాలని కార్మిక, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎం.హరి జవహర్‌లాల్‌ను సిఐటియు నాయకులు కోరారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, శ్యామ్‌క్రగ్ పిస్టన్స్, రింగ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్ అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. రణస్థలం మండలం వరిశాం వద్ద గల శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమలో 30 సంవత్సరాల సర్వీసు పూర్తయిన కార్మికులను యాజమాన్యం అన్యాయంగా బలవంతపు రిటైర్మెంట్ చేస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇలా ఇప్పటివరకు 32 మంది కార్మికులను యాజమాన్యం రిటైర్మెంట్ చేయించిందన్నారు. స్టాండింగ్ ఆర్డర్ ఉన్నట్లు ఇప్పటివరకు కార్మికులకు, యూనియన్‌కు తెలీదని చెప్పారు. కార్మికులకు సర్వీసు ఉండగానే యాజమాన్యం అక్రమంగా నిలుపుదల చేయడంతో, కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్‌కు పాల్పడుతోందని విమర్శించారు. మోడల్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం రిటైర్మెంట్ వయసు వరకు కార్మికులను విధుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిలుపుదల చేసిన కార్మికులను నిలుపుదల చేసిన నాటి నుంచి వేతనాలు చెల్లించేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కార్యదర్శి, కార్మికులకు రిటైర్మెంట్ వయసు వచ్చే వరకు విధుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో గొర్లె కృష్ణ ఉన్నారు.

హరిజవహర్‌లాల్‌ను కలిసిన సిఐటియు నాయకులు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆదిత్యుని ఆదాయం రూ.51.40 లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.51,40,769 లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. 36 రోజులకు గానూ నోట్ల రూపంలో రూ.49,61,426, నాణేల రూపంలో రూ.1,79,343 మొత్తంగా రూ.51,40,769 వచ్చిందని చెప్పారు. ఆలయంలోని అనివెట్టి మండపంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 53 గ్రాముల బంగారం, 3.10 కేజీల వెండి, 21 అమెరికా డాలర్లు, 50 పౌండ్లు, 22 విదేశీ కరెన్సీల రూపంలో ఆదాయం లభించిందన్నారు. రామతీర్థం ఆలయ ఇఒ కిషోర్ కుమార్, అరసవల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ లెక్కింపును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు కె.సోమేశ్వరరావు, ఎల్.గోవిందరావు, జె.శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- యంత్ర సేవా పథకంలో 52 పరికరాలు అందజేత

ప్రజాశక్తి - నరసన్నపేట

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, వ్యవసాయమంటే దండగ కాదు పండగ అనేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద యంత్ర సేవా పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. రూ.16 కోట్ల విలువైన 52 పరికరాలను రైతు గ్రూపు సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికె పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రైతులకు ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్ల వంటి వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రైతులు రెండేళ్లుగా వీటి ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. యంత్ర పరికరాలతో కూలీల కొరతకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని 10,444 ఆర్‌బికెల పరిధిలో రైతులు గ్రూపుగా ఏర్పడి, వ్యవసాయ పరికరాలను తక్కువ ధరకే ఇతర రైతులకు అద్దెకిచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. గ్రామ స్వరాజ్యం అనే పదానికి నిజమైన నిర్వచనం చెప్పేలా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చింతు రామారావు, ముద్దాడ బైరాగి నాయుడు, సర్పంచ్ బి.శంకర్, రాజాపు అప్పన్న, కోరాడ చంద్రభూషణ్ గుప్తా, నరసన్నపేట ఎడి రవీంద్ర భారతి, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

భానుడి భగభగలతో పిల్లలు, వృద్ధులు, యువత అల్లాడుతున్నారు. దీంతో వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు యువకులు నారాయణపురం ఆనకట్ట కాలువలో జలకాలాడుతూ సేద తీరారు.

- ప్రజాశక్తి, బూర్జ

హెల్త్‌కార్డు నమోదుకు నేడు ఆఖరు

శ్రీకాకుళం : న్యాయవాదులు హెల్త్‌కార్డులు పొందేందుకు ఈనెల పదో తేదీ ఆఖరు అని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాము ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్, ప్రభుత్వ గ్రాంటు కింద ప్రత్యేక కమిటీ 2023-24 సంవత్సరానికి న్యాయవాదులకు గ్రూపు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. న్యాయవాదితో పాటు కుటుంబంలోని ముగ్గురికి మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రీమియంలో మూడో వంతు న్యాయవాది చెల్లిస్తే, మిగతా మొత్తాన్ని ప్రభుత్వ గ్రాంట్, బార్ కౌన్సిల్ నిధుల నుంచి భరిస్తారని తెలిపారు.

ప్రమాదవశాత్తు న్యాయవాది చనిపోతే రూ.10 లక్షల పరిహారం అందుతుందని పేర్కొన్నారు. 70 ఏళ్ల లోపు న్యాయవాదులు మాత్రమే పాలసీకి అర్హులని స్పష్టం చేశారు. న్యాయవాదికి సంబంధించిన వివరాలు బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌లో https://barcouncilap.org/insurance-scheme ఉన్నదీ, లేనిదీ తెలుసుకోవాలని సూచించారు. ఈ పాలసీ ఈనెల 15వ తేదీ నుంచి 2024 జూన్ 14వ తేదీ వరకు అమల్లో ఉంటుందని తెలిపారు.

గెలుపునకు సమిష్టిగా పనిచేద్దాం

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేసేందుకు సమిష్టిగా పనిచేద్దామని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు ఎన్నికల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీని రద్దు చేసే అవకాశం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలతో పాటే రాష్ట్రంలోనూ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు లేకపోలేదన్నారు. వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో జనం టిడిపి వైపు చూస్తున్నారని చెప్పారు. టిడిపిలో కొందరు వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్తున్న సందర్భంలో టిడిపి నష్టం వాటిల్లకుండా అంతా సమిష్టిగా పనిచేయాలని కోరారు. శ్రీకాకుళం నియోజకవర్గం తొలి నుంచీ టిడిపికి కంచుకోటగా ఉందని చెప్పారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని గుర్తు చేశారు. పార్టీలో నెలకొన్న అంతర్గత పోరు వల్ల తాను ఓడిపోయినా తన సతీమణి మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవిని 2014 ఎన్నికల్లో 25 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని చెప్పారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే ఇది సాకారమైందన్నారు. ఇదే స్ఫూర్తితో 2024 ఎన్నికలకు సమాయత్తం కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో తాను ఎమ్మెల్యేగా కలిసికట్టుగా టిడిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తాను అందరితో కలిసికట్టుగా పనిచేసినా కొందరు తనను అపార్థం చేసుకున్నారని చెప్పారు. తమ కుటుంబం ఎప్పుడూ అధిష్టానం నిర్ణయానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి, పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో నాయకులు మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, జామి భీమశంకరరావు, చిట్టి మోహన్, శీర రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ క్యాంపస్ స్పోర్ట్స్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలంలోని ఎస్ఎం పురంలో గల శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో మెగా ఇంటర్ యూనివర్సిటీ క్యాంపస్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ట్రిపుల్ ఐటి వైస్ ఛాన్సలర్ ఎం.విజయ్ కుమార్, డైరెక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. స్పోర్ట్స్ బోర్డు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో విశ్వవిద్యాలయంలోని ఆర్.కె.వ్యాలీ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ప్రాంగణాల విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఇతర పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటి డైరెక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తి ముఖ్యమన్నారు. విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ కె.మోహనకృష్ణ చౌదరి, ఆర్‌జియుకెటి యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ షంసద్ బేగం, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, స్పోర్ట్స్ విభాగాధిపతి వీరబాబు, దిలీప్ కుమార్, కృష్ణంరాజు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ట్రిపుల్ ఐటి విసి, డైరెక్టర్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం

శ్రీకాకుళం : శాస్త్రీయ సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక అశాస్త్రీయ భావనలకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తోందని చెప్పారు. విద్యావంతులంతా జెవివి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం 'జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం' అనే పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సమావేశంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కొత్తకోట అప్పారావు, జిల్లా సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, ఐ.జగన్మోహనరావు, కోశాధికారి కుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ ఉమామేశ్వరరావు, జిల్లా సమత కో కన్వీనర్ ఎర్రమ్మ, యువజన కన్వీనర్ పురుషోత్తం, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

17న వర్సిటీలో ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ఈనెల 11వ తేదీన నిర్వహించాల్సిన వర్సిటీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (బిసిడిసి) కోఆర్డినేటర్ల పోస్టుల ఇంటర్వ్యూలను ఈనెల 17వ తేదీకి మార్చినట్లు వేసినట్లు రిజిస్ట్రార్ సిహెచ్.ఎ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలనాపరమైన పనుల కారణంగా ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేదీ మార్పును గమనించాలని సూచించారు.

విద్యుత్ సేవలు సక్రమంగా అందించాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

తూర్పు తీర విద్యుత్ పంపిణీ సంస్థ ఆమదాలవలస సర్కిల్ పరిధిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.భాస్కరరావు నూతనంగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఆమదాలవలసలో విధులు నిర్వహించేందుకు వచ్చారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో విద్యుత్ శాఖకు సంబంధించిన సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్ పంపిణీలో సాంకేతిక పరమైన లోపాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి మరమ్మతులు చేసి విద్యుత్ సేవలను వినియోగదారులకు అందించాలని అన్నారు. బొడ్డేపల్లిపేట, పూజారిపేట, శ్రీకాకుళం-ఆమదాలవలస సిఎస్‌పి రోడ్డు విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరితగతిన మార్చాలని సూచించారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న రవికుమార్, సత్యవతి

రాజగోపాలరావు అభివృద్ధి దార్శనికుడు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అభివృద్ధి దార్శనికుడని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని అక్కులపేటలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి అధ్యక్షతన రాజగోపాలరావు జయంత్యుత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో ఉన్న అనుబంధమే ఆయనను చిరస్మరణీయుడిగా నేటికీ నిలబెట్టిందన్నారు. జిల్లాకు 36 ఏళ్ల పాటు పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఆరు చక్కెర కర్మాగారాలను మంజూరు చేస్తే... అందులో ఒకటి ఆమదాలవలస సహకార చక్కర కర్మాగారం అని అన్నారు. వంశధార ప్రాజెక్టుకు రూపకల్పన చేయించి జిల్లాను సస్యశ్యామలం చేశారన్నారు. వంశధార ప్రాజెక్టుకు రాజగోపాలరావు ప్రాజెక్టుగా నామకరణం చేశారని, ఆయన చిరస్థాయిగా తరతరాలకు గుర్తుండిపోతారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ మాట్లాడుతూ రాజగోపాలరావు ప్రజలు మేలుకోరే వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, బొడ్డేపల్లి యామిని, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, అన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, గొండు రమణ, గొర్లె సూర్యం, బి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ పనులు పరిశీలన

రణస్థలం : మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు మండలం బొంతుపేట, రణస్థలం మండలం రావాడ, రణస్థలం, లంకపేట, వరిశాం తదితర గ్రామాల్లో తోటపల్లి కాలువ పెండింగ్ పనులు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి భూ పరిహార సమస్య పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఈ సీజన్‌కు తోటపల్లి కాలువ ద్వారా రణస్థలం, లావేరు మండలాలకు సాగునీరు అందిచాలని అధికారులకు ఆదేశించారు. ఇంకా ఎమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, తోటపల్లి జెఇ రామలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు, పిన్నింటి లక్షుంనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉపాధి' హామీ పనులు పరిశీలన

జి.సిగడాం: ఉపాధి హామీ కూలీలు రెండు పూటలా పనిచేసి కనీస కూలి తీసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గెడ్డకంచరాం ఊరచెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కూలీలతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిచేసిన ప్రదేశంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి మౌలిక సదుపాయాలతో పాటు, తాగునీరు, నీడ కల్పించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి నిధులతో గెడ్డకంచరాం పంచాయతీ రెల్లిపేట నుంచి గదబపేట వరకు గ్రావెల్ రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాద్, సిగడాం పిఎసిఎస్ చైర్మన్ ఎర్నేని ప్రకాష్, ఎంపిటిసి పరసరాపు మంగమ్మ, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎపిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టిడిపి కార్యాలయం

నేడు టిడిపి కార్యాలయం ప్రారంభం

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గ ఎన్‌టిఆర్ భవన్ కోటబొమ్మాళి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభిస్తామని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొంటారని అన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు మండలాల నుంచి 10 వేలు మంది కార్యాకర్తలు, అభిమానులు హజరవుతారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మండల నాయకులపై, కార్యకర్తలపై ఉందని అన్నారు. మధ్యాహ్నం భోజన ఏర్పాటు కూడా చేశామని అన్నారు.

రెవెన్యూ అధికారులపై విచారణ!

పలాస : కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారులపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో జగనన్న టౌన్ షిప్‌కు సంబంధించి 150 ఎకరాలు డీపట్టా భూములను ప్రభుత్వం సేకరించింది. అందులో భాగంగా బొడ్డపాడుకు చెందిన ఓ రైతుకు దస్త్రాలు ప్రకారం తనకున్న భూమికి పరిహారం చెల్లించిందలేదని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లాకు చెందిన పోలీసు, రెవెన్యూ అధికారులు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేసినట్లు సమాచారం.

ఎపిఆర్‌జెసిలో మెరిసిన విద్యార్థులు

జనని ఆమదాలవలస

దీపిక నందిగాం

శ్యామ్‌సంధ్య కోటబొమ్మాళి

కోటబొమ్మాళి: ఎపిఆర్‌జెసిలో మండల కేంద్రంలోని విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం రాత్రి విడుదలైన పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో 75వ ర్యాంకు శ్యామ్ సంధ్యకు, 366 ర్యాంకు హనుమంతు భాంధవికు, 726 ర్యాంకు ఉప్పాడ ప్రశాంత్‌కు, 1345 ర్యాంకు కోన భారతికు, 1416 ర్యాంకు బమ్మిడి కవితలు ప్రతిభ కనబరిచారు. ఈ కోచింగ్ సెంటర్‌లో 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఐదుగురు మంచి ర్యాంకులు వచ్చాయి. విద్యార్థులకు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఎన్.చైతన్య, ఎన్.జగదీష్‌లు అభినందనలు తెలియజేశారు.

నందిగాం : మండలంలోని సన్‌రైజ్ కోచింగ్ సెంటర్‌లో పెంటూరుకు చెందిన యెజ్జి దీపిక గురువారం విడుదలైన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో 550వ ర్యాంకు సాధించిందని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పైడిశెట్టి జగదీష్ తెలిపారు. నందిగాం జెడ్‌పి హైస్కూల్‌లో పదిలో చదువుకున్నారు. ర్యాంకు సాధించిన దీపికకు సిబ్బంది ఎస్.కామేశ్వరరావు, కె.సంతోష్ కుమార్, పి.సూర్యారెడ్డి అభినందించారు.

ఆమదాలవలస : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని భవిత హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అరసవిల్లి జనని ఉత్తమ ర్యాంకు సాధించింది. గురువారం విడుదలైన పరీక్షా ఫలితాలలో బైపిసి విభాగంలో రాష్ట్రస్థాయిలో 331 వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా విద్యార్థిని జననికి పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావులు అభినందించారు.

వినతిపత్రం అందజేస్తున్న బాలాజీ

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండిలో ఉపాధి హామీ పనులు వెంటనే కలిపించాలని ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు కె.బాలాజీ కోరారు. ఈ మేరకు బెండి సచివాలయ సిబ్బంది ఎం.ఈశ్వరరావుకు 150 మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పనులు ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా బెండిలో మాత్రం ఇంత వరకు పనుల ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోరిన వెంటనే పని కల్పించాలని చట్టం చెబుతున్నా అధికారులు పట్టించుకోపోవడం సరికాదన్నారు. ప్రతిఒక్కరికీ వంద రోజులు పని ఇప్పిస్తున్నామని చెప్పిన నాయుకులకు క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియవా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఆర్.నీలాచలం, కె.హేమసుధన్ కె.మాధవరావు, కృష్ణారావు, ఎం.నరేష్, మల్లయ్య, కనకారావు, శంకరరావు పాల్గొన్నారు.

రేపు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. స్కూల్‌లో దరఖాస్తులు అందించిన అభ్యర్థులు కూడా హల్ టిక్కెట్లు పొందాలన్నారు. హాల్ టికెట్లతో ఆదివారం ఉదయం 8.45 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

నవధాన్యాల విత్తనాలు సిద్ధం

విత్తనాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

నవధాన్యాల సాగుకు రైతులందరూ సిద్ధం కావాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని చేపేనపేట యూనిట్ నిమ్మతొర్లువాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్లను శుక్రవారం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిట్‌కి సంబంధించి ఐదు గ్రామాల్లో ఖరీఫ్ సాగుకు ముందు రైతులతో ఈ ప్రీ మాన్ సూన్ డ్రై శోయింగ్ విత్తనాలను పొలాల్లో వేయిస్తున్నామని చెప్పారు. 3వ విడతగా 250 కిట్లను తయారు చేశామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామంలో క్షేత్రస్థాయిలో రోజంతా రైతులకు అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, మల్లేశ్వరరావు, లక్ష్మి, జానకిరామ్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాణి

ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు

సంతబొమ్మాళి : మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే చెల్లుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మలగాంలో సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 42 నెలల కాలంలో బోరుభద్ర-2 సచివాలయం పరిధిలో రూ.11.33 కోట్లు ప్రజలకు ప్రభుత్వం అందించిందని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైసిపి నాయకులు ఎం.అప్పారావు, సుగ్గు రామిరెడ్డి, నక్క భీమారావు, బొంగు కొండయ్య, పుక్కళ్ల ధర్మరాజు, గొరుసు సవరయ్య, మీన కేతనరెడ్డి, సర్పంచ్‌లు జోగి రాములమ్మ, గుజ్జు మోహన్‌రెడ్డి, ఎంపిడిఒ సిహెచ్.ప్రేమలీల, ఎపిఎం ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కవిటి హెచ్‌ఎంగా చంద్రశేఖరరావు

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎం.చంద్రశేఖరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి హెచ్‌ఎంగా పనిచేసిన బెందాలం మల్లేశ్వరరావు చంద్రశేఖరరావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, బి.జానకిరావు, పి.జానకిరావు, అరుణ, పాఠశాల సిబ్బంది చంద్రశేఖరరావుకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మేఘవరానికి చెందిన సదాశివుని భారతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నామినీ అయిన కుమారుడు శివగణేష్‌కు వైఎస్‌ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.పది వేలు సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూరాడ రాజారావు, మరువాడ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సూరాడ జోగారావు, మేఘవరం ఉప సర్పంచ్ మంకు సింహాచలం, గంట ఈశ్వరరావు, కార్యదర్శి కోరాడ విద్య, వెల్ఫేర్ అసిస్టెంట్ అంగూరు మధుసూదనరావు, వాలంటీర్ పైల కేశవరెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు పరిశీలన

పొందూరు: మండలంలో గోకర్ణపల్లి పంచాయతీ రంగనాథపేటలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా చేపడుతున్నారు. గ్రామంలో 20 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఈ ట్యాంకును రూ.25.6 లక్షలతో నిర్మిస్తున్నట్లు సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ తెలిపారు. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటులో భాగంగా శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో ఈ పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో చేపడుతున్న ఈ ట్యాంకు పనులను శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ చైతన్య, పంచాయతీ కార్యదర్శి మీసాల గోవిందరావుతో కలిసి పరిశీలించారు.

రుణాలను వినియోగించుకోవాలి

పలాస : యూనియన్ బ్యాంకు ద్వారా అందజేస్తున్న రుణాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ అధికారి ఎం.వెంకట్ తిలక్ అన్నారు. కాశీబుగ్గ యూనియన్ బ్యాంకు ఆవరణలో శుక్రవారం రుణమేళా కార్యక్రమం నిర్వహించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో వివిధ రకాల రుణాలు ప్రవేశపెట్టామని అన్నారు. బంగారంపై, యూనియన్ ఎక్విప్‌మెట్ ఫైనాన్స్, ఎస్ఎంఇ రుణాలు అందజేస్తున్నామని అన్నారు. అనంతరం 10 మంది లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌పి అధికారి వి.సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ ఎన్.సి.దాస్, లోన్ మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

సన్మానిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి- నందిగాం

ప్రతిఒక్క ఉద్యోగీ తన పదవీ కాలంలో చేసిన సేవలే వారికి గుర్తింపు నిస్తాయని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒగా పనిచేస్తూ ఇటీవల టెక్కలి బదిలీ అయిన హెచ్.వి.రమణమూర్తిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో 20 ఏళ్ల పాటు అటెండర్‌గా పనిచేసిన గాయత్రిని మండల పరిషత్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. అలాగే నూతనంగా ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్‌ను, ఎఒగా బాధ్యతలు స్వీకరించిన ధనలక్ష్మిని, మండల కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన పేరాడ ఆనందరావులకు స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ పద్మావతి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఇఒపిఆర్‌డి రాజారావు, ఎంఇఒ నరసింహులు, ఎపిఒ నాగరాజు, నందిగాం ఎంపిపి అంబోడి విష్ణు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి రుణాలు

చెక్కును అందజేస్తున్న వెంకటరావు చిట్టి

ప్రజాశక్తి- పలాస

వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. పిఎసిఎస్ కార్యాలయంలో ఎస్‌టి అదర్స్ పథకం కింద పిఎసిఎస్ ఆధ్వర్యాన రైతులకు రూ.18 లక్షల రుణాలు చెక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయం అభివృద్ధికి ఎప్పటకప్పుడు రైతులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని చెప్పారు. ఎవరికైనా రుణాల అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. శాప మన్మథరావుకు రూ.5 లక్షలు, జడ్డే పాపారావుకు రూ.3 లక్షలు, మల్లా నాగభూషణరావుకు రూ.5 లక్షలు, సవర సురంగికు రూ. 5 లక్షలు చొప్పున రుణాలు అందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ శ్రీనివాసరావు, డిసిసిబి బ్యాంకు మేనేజర్ డి.కృష్ణారావు, సూపర్‌వైజర్ ఎర్రయ్య, బొడ్డపాడు ఎంపిటిసి మద్దిల పాపారావు, కేదారిపురం సర్పంచ్ ధనుంజయ్, బొడ్డపాడు ఉప సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ఇచ్ఛాపురం: విత్తనాలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు

ఇచ్ఛాపురం : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్‌ఆర్ ప్రచార కమిటీ జిల్లా చైర్మన్, వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి, కౌన్సిలర్ చిదిపితు జగన్నాయకులు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నలో రైతులకు ఖరీఫ్‌కు సంబంధించి వరి విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ భవాని పాల్గొన్నారు.

టెక్కలి : రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని బొప్పాయిపురం, అక్కవరం సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, పొట్నూరు భూలక్ష్మి అన్నారు. బొప్పాయిపురం గ్రామ సచివాలయంలో ఖరీఫ్ సీజన్‌కి అవసరమయ్యే యూరియా, డిఎపిలను పంపిణీ చేశారు. అనంతరం విక్రాంపురంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిడిఒ రవికుమార్, కార్యదర్శి వర్ధన్, వ్యవసాయశాఖ ఉద్యోగి సుమంత్, రామారావు, ధర్మారావు, భాస్కర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల మంజూరుపై హర్షం

మాట్లాడుతున్న మారుతీపాల

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లాలోని మోహన, గుసాని, కాశీనగర్ బ్యాక్‌ల అభివృద్ధికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నిధులు విడుదల చేయడం హర్షణీయమని బిజెడి రాష్ట్ర కార్యదర్శి మారుతీ పాల అన్నారు. కాశీనగర్ ఎన్ఎసి కార్యాలయంలో గురువారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెడి ముఖ్య కార్యదర్శి పాండ్యన్ జిల్లాలోని కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, చర్చిలు, మస్జీదులు ఇటీవల పరిశీలించారని, వాటి అభివృద్ధికి రూ.18.35 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. కాశీనగర్ బ్లాక్, ఎన్ఎసిలకు రూ.2 కోట్లు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో గజపతి జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి, కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, కాశీనగర్ ఎన్ఎసి ఉపాధ్యక్షులు రఘురాం సాహు, కాశీనగర్ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ కటికి రామారావు, ఖరడ సర్పంచ్ అఖిల పాత్ర, ఖండవ నాయక్ సర్పంచ్ రొక్కం సతీష్, ఖండవ పంచాయతీ సమితీ మెంబర్ జగన్నాథ్ దొర పాల్గొన్నారు.

వైసిపి నేతల్లో దడ పుట్టిస్తున్న టిడిపి మేనిఫెస్టో

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విడుదల చేసిన మేనిఫెస్టో చూసి వైసిపి నేతల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆవరణలో శుక్రవారం టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అధ్యక్షతన నియోజకవర్గం స్థాయిలో విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వస్తే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నారని అన్నారు. ఇప్పటికే గ్రామాల్లో మేనిఫెస్టో చూసి ప్రజలు టిడిపికు ఆకర్షితులవుతున్నారన్నారు. అందుకు టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు రూ.15 వేలు, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి చదువుకునేందుకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామని మేనిఫోస్టోలో పొందుపరిచారని చెప్పారు. ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని హామీనిచ్చారని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టిక్కెట్ లేని ప్రయాణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, టంకాల రవి శంకర్ గుప్త, జోగ మల్లి, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధం కావాలి



కవిటి : మాట్లాడుతున్న ప్రకాష్

ప్రజాశక్తి- కవిటి

మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుందని, రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాలతో, ఎరువులతో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉండాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాల వివరాలు తీసుకుని సకాలంలో అందించాలని సూచించారు. ఎరువుల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ సహాయకులు తమ పరిధిలో రైతులు, వ్యవసాయ, వ్యసాయేతర భూములు, ప్రభుత్వం అందించిన పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలతో పాటు పూర్తి సమాచారం ఉండాలని సూచించారు. ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు.సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, వ్యవసాయ శాఖ అధికారి డి.రూప, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన వరి, పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామని ఎఒ శ్రీదేవి తెలిపారు. ఎంపిపి ఛాంబర్‌లో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి ప్రతినిధి కె.మోహనరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

టెక్కలి : ఆర్థికసాయం అందజేస్తున్న నేతాజీ

టెక్కలి : మండలంలోని పెద్దశానకు చెందిన కసిబింది లక్ష్మి నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తుంది. విషయం తెలుసుకున్న అక్షర ఫౌండేషన్ చైర్మన్ బొడ్డేపల్లి నేతాజీ శుక్రవారం ఆమెకు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో త్రినాథ్, విశ్వనాథం, గడ్డెయ్య, షణ్ముఖ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురానికి చెందిన కడగల రామయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే మడపాల వైకుంఠరావు కుటుంబ సభ్యులను పతివాడ చిన్నబాబు కుటుంబ సభ్యులనూ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు. నంబాల వెంకటరావు, బమ్మిడి దామోదరరావు, పైల కూర్మారావు, కవిటి రామస్వామి, పైల లక్ష్మీపతి, పతివాడ వాసుదేవరావు పాల్గొన్నారు.

రాపాకలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య

- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో రెండు నెలలుగా లోవోల్టేజీ సమస్యతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు ఉక్కబోత, వేడిగాలులు విపరీతంగా పెరగడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు అల్లాడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వోల్టేజీ హెచ్చు, తగ్గులు అవుతుండడంతో ఇంట్లో బల్బులు, ఫ్యాన్లు, టివిలు, విలువైన విద్యుత్ పరికరాలు ఎప్పడు కాలిపోతాయో అంటూ భయాందోళనలు చెందుతున్నారు. గ్రామంలోని రామాలయం వీధి, కొండవీధి, భజన్నగారి వీధి, వండాన వీధుల్లో ఈ సమస్య కనిపిస్తుంది. గ్రామంలోని రామాలయం వీధిలో తరుచుగా విద్యుత్ నిలిచిపోతుంది. గురువారం రాత్రి 11 నుంచి శుక్రవారం ఉదయం 5 గంటలు వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5గంటలు వరకూ మరలా సరఫరా నిలిచిపోయింది. ప్రధానంగా ఇక్కడ విద్యుత్ కనెక్షన్లకు సరిపడిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో లోడ్ ఎక్కువై సప్లయ్ నిలిచిపోతుంది. రెండేళ్లుగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప ఏర్పాటు చేయడం లేదంటూ వీధి వాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటలు వరకూ లోవోల్టేజీ వల్ల ఫ్యాన్లు అసలు తిరగడం లేదని చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. దీంతో ఉక్కబోతతో నిద్రపట్టడం లేదని, చిన్నారులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. నిద్ర లేమితో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు అంచనాలు వేశామని, కొద్ది రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.